# సాక్షి
## వికారాబాద్

గురువారం । 9 । నవంబర్ । 2023






**తెలంగాణ తేజం 'మర్రి'**

మర్పల్లి మండలం సిరిపురం గ్రామానికి చెందిన మర్రి చెన్నారెడ్డి ఐదు దశాబ్దాల రాజకీయ దురంధురుడు. 2లో▸



**'రచ్చ'బండ రాజకీయం**

సర్వేలన్నీ మాకే అనుకూలం.. కాదు ఇదంతా అబద్ధం.. ప్రజల మద్దతు మాకే ఉందంటూ నేతలు ప్రచారం చేసుకుంటున్నారు. 2లో▸



**కమ్ముకొస్తున్న మబ్బులు**

కమ్ముకొస్తున్న మబ్బులు రైతన్నల గుండెల్లో గుబులు రేపుతున్నాయి. ఉపరితల ఆవర్తనం కారణంగా వర్షాలు కురుస్తున్నాయి. 3లో▸

## మద్దతుదారులతో వచ్చి.. నామినేషన్ వేసి



పరిగిలో నామినేషన్ దాఖలు చేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి



పరిగిలో నామినేషన్ వేస్తున్న బీజేపీ అభ్యర్థి మారుతికిరణ్




నామినేషన్ దాఖలు చేస్తున్న బీఎస్పీ వికారాబాద్ అభ్యర్థి క్రాంతికుమార్

## న్యూస్‌రీల్

### నేడు కొడంగల్‌కు కేటీఆర్

**కొడంగల్:** కొడంగల్‌కు గురువారం మంత్రి కేటీఆర్ వస్తున్నట్లు బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. పార్టీ కొడంగల్ అసెంబ్లీ అభ్యర్థి పట్నం నరేందర్‌రెడ్డి గురువారం నామినేషన్ వేయనున్నందున ఆ కార్యక్రమంలో మంత్రి కేటీఆర్ పాల్గొంటారని గులాబీ నేతలు తెలిపారు. పట్టణ శివారులోని బండ ఎల్లమ్మ ఆలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ఊరేగింపు ఉంటుందన్నారు. అనంతరం అంబేడ్కర్ చౌరస్తాలో ప్రజలను ఉద్దేశించి కేటీఆర్ ప్రసంగిస్తారని చెప్పారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని వారు కోరారు.

### మాది ప్రజా సంక్షేమ పాలన
మంత్రి మహేందర్‌రెడ్డి



ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న మంత్రి మహేందర్‌రెడ్డి

**కొడంగల్:** ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రంలో ప్రజా సంక్షేమ పాలన సాగిస్తున్నారని మంత్రి మహేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని చిట్లపల్లిలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి పట్నం నరేందర్‌రెడ్డిని గెలిపించాలని ప్రజలను కోరారు. కేసీఆర్ సారథ్యంలో ప్రతి ఇంటికి మేలు జరిగిందన్నారు. ఆసరా పింఛన్లు, రుణ మాఫీ, రైతు బంధు, రైతు బీమా, ఉచిత కరెంటు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, దళిత బంధు, బీసీ బంధు, గృహలక్ష్మి తదితర పథకాలతో ప్రతి కుటుంబానికి న్యాయం చేసినట్లు చెప్పారు. ప్రజలు మరోసారి బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు. అనంతరం అహ్మద్‌పల్లిలో ప్రచారం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, కౌన్సిలర్ మధుయాదవ్, న్యాయవాది మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శిగా హరీశ్వర్‌రెడ్డి



**బంట్వారం:** యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శిగా హరీశ్వర్‌రెడ్డి నియమితులయ్యారు. బంట్వారం మండలం మాలసోమారానికి చెందిన హరీశ్వర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పని చేస్తున్నారు. ఈ నేపథ్యంలో హరీశ్వర్‌రెడ్డిని తెలంగాణ యూత్ కాంగ్రెస్ కార్యదర్శిగా నియమిస్తూ ఇండియన్ యూత్ కాంగ్రెస్ సెక్రటరీ సురభి ద్వివేది బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. పార్టీ పెద్దలకు హరీశ్వర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా మరింత చురుగ్గా పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటానని తెలిపారు.

### క్రీడాకారిణికి సన్మానం



**తాండూరు టౌన్:** అంతర్జాతీయ ఖోఖో క్రీడలో బంగారు పతకం సాధించిన తాండూరు గురుకుల పాఠశాల పూర్వ విద్యార్థిని రుక్మిణిని ఆ పాఠశాల ఉపాధ్యాయులు బుధవారం ఘనంగా సన్మానించారు. ఇటీవల మలేషియాలో జరిగిన అంతర్జాతీయ ఖోఖో క్రీడల్లో రుక్మిణి పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి మాట్లాడుతూ.. చిన్నప్పటి నుంచే రుక్మిణి ఖోఖోలో ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు తెలిపారు. పీఈటీ రఘు నేతృత్వంలో శిక్షణ పొందినట్లు చెప్పారు. అంతర్జాతీయ క్రీడాకారిణిగా ఎదగడం సంతోషంగా ఉందన్నారు. ప్రస్తుతం రుక్మిణి వికారాబాద్‌లోని సంగం లక్ష్మీబాయి గురుకుల కళాశాలలో ఇంటర్ చదువుతోంది.

# సక్సెస్ సగమేనా..?



**అసమ్మతి నేతలపై ఎంపీ రంజిత్‌రెడ్డి దృష్టి**

- బుజ్జగించే పనిలో బిజీబిజీ
- దారికొచ్చింది సగం మందే
- మిగిలిన వారు పక్క పార్టీల్లోకి..
- ఇతర పార్టీల నేతలను ఆకర్షించే పనిలో నిమగ్నం

**వికారాబాద్:** అధికార పార్టీ అసమ్మతి నేతలను బుజ్జగించే ప్రయత్నాలు బెడిసికొడుతున్నాయి. పార్టీకి దూరమవుతున్న నేతలను అక్కున చేర్చుకునేందుకు చేసిన ప్రయత్నాలు అంతం మాత్రమే అని చెప్పవచ్చు. బీఆర్ఎస్ చేవెళ్ల, వికారాబాద్ నియోజకవర్గాల అసెంబ్లీ ఎన్నికల ఇన్‌చార్జ్‌గా నియమితులైన ఎంపీ రంజిత్‌రెడ్డి పార్టీ వ్యవహారాలను చక్కదిద్దే ప్రయత్నం మొదలుపెట్టారు. అయితే వికారాబాద్‌లో అసమ్మతి నేతలు ఎక్కువగా ఉండడంతో ముందుగా ఇక్కడే ఎక్కువ దృష్టి సారించారు. ఈ విషయాన్ని అధిష్టానానికి కూడా తెలియజేశారు. దీంతో ఆయన్ను వికారాబాద్ నియోజకవర్గానికే పరిమితం చేసి పరిస్థితిని చక్కబెట్టాలని అధిష్టానం సూచించింది. అప్పటి నుంచి ఎంపీ అసమ్మతి నేతలను దారిలోకి తెచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. పార్టీ అభ్యర్థి ఆనంద్ గెలుపు బాధ్యతలు భుజాన వేసుకున్న ఆయన వలసలు ఆపేందుకు విశ్వప్రయత్నం చేశారు. కానీ సఫలం కాలేదు. అసమ్మతి నేతల్లో ఒకరిద్దరిని మాత్రమే ఇతర పార్టీల్లోకి వెళ్లకుండా చేయగలిగారు.

**పార్టీ వీడిన మెజార్టీ నేతలు**

బీఆర్ఎస్ వికారాబాద్ నియోజకవర్గంలో నెలకొన్న అసమ్మతిని సద్దుమణిగేలా చేయడంలో ఎంపీ మొదలుకొని అధిష్టాన ముఖ్య నేతల చేసిన ప్రయత్నాలు చాలా వరకు విఫలమయ్యాయి. ఎంపీ రంజిత్‌రెడ్డి ఇన్‌చార్జ్ బాధ్యతలు చేపట్టింది మొదలు వికారాబాద్‌లోనే మకాం వేసి నేతలను బుజ్జగించే పనులు మొదలు పెట్టారు. వారిని అధిష్టానం వద్దకు తీసుకెళ్లి సంప్రదింపులు జరిపారు. అయితే తమకు పార్టీ అంటే గౌరవమని, స్థానిక ఎమ్మెల్యే వల్లే సమస్యలని తేల్చి చెప్పినట్లు సమాచారం. పార్టీ పెద్దల సూచనలతో బీఆర్ఎస్‌లోనే ఉంటూ అభ్యర్థి గెలుపు కోసం పని చేస్తున్నారు. అయినా ఎమ్మెల్యేతో అంటీముట్టనట్లుగానే వ్యవహరిస్తున్నారు. ఎంపీ ఆధ్వర్యంలో పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. ఇదిలా ఉండగా సగం మంది అసమ్మతి నేతలు ఇప్పటికే బీఆర్ఎస్ వీడి హస్తం పార్టీలో చేరారు. గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కొండల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాంచంద్రారెడ్డి, వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల రమేశ్ దంపతులు, ధారూరు ఎంపీపీ నరోత్తంరెడ్డి, కౌన్సిలర్ చందర్‌నాయక్, పట్లూర్ ఎంపీటీసీ సురేశ్, మరో సీనియర్ నాయకుడు రామేశ్వర్, పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు అధికార పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరారు.

**వ్యూహాలకు పదును**

బీఆర్ఎస్ నుంచి వలసలు ఆపేందుకు ఎంపీ రంజిత్‌రెడ్డి చేసిన ప్రయత్రాలు వృథా కావడంతో ఆ పార్టీ నేతలు వ్యూహాలు మార్చారు. సొంత పార్టీ నేతలను ఆపడం మాని ప్రత్యర్థి పార్టీల నుంచి నాయకులను చేర్చుకోవడంపై దృష్టి సారించారు. ఈ క్రమంలో బీఎస్పీ, కాంగ్రెస్, తదితర పార్టీల నుంచి పలువురు నేతలను బీఆర్ఎస్‌లో చేర్చుకున్నారు. ఇదే క్రమంలో ఆయన మండలాల వారీగా పీఆర్‌ఓలను నియమించుకొని పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నారు. ఎప్పటికప్పుడు సమాచారం తెప్పించుకుని అందుకు అనుగుణంగా పావులు కదుపుతూ పార్టీ క్యాడర్‌ను సమన్వయం చేస్తున్నారు.

## కాంగ్రెస్ హయాంలోనే గిరిజన సంక్షేమం

**డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి**



ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న రామ్మోహన్‌రెడ్డి

**కుల్కచర్ల:** కాంగ్రెస్ హయాంలోనే గిరిజనులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందారని ఆ పార్టీ పరిగి అసెంబ్లీ అభ్యర్థి, డీసీసీ అధ్యక్షుడు టీ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం కులకచర్ల, హన్మ్యానాయక్ తండా, చెల్లాపూర్, సాలీవ్గడు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేదలు, బడుగు బలహీన వర్గాల ప్రజలు బాగు పడాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. హస్తం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు గిరిజనులకు భూములు ఇవ్వడం, బోర్లు వేయించడం, ఇళ్లు మంజూరు చేయడం వంటి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసినట్లు తెలిపారు. బీఆర్ఎస్ పాలనలో తండాలు అభివృద్ధికి నోచుకోవడం లేదని ఆరోపించారు. అన్ని వర్గాలను దృష్టిలో ఉంచుకొనే కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను రూపొందించిందని పేర్కొన్నారు. అధికారంలోకి రాగానే పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం అఖిల భారత బంజార సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు రాహుల్ నాయక్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, బ్లాక్ టు అధ్యక్షుడు భరత్‌కుమార్, మాజీ ఎంపీపీ శాంతిరంగ్యా, మండల ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, చౌడాపూర్ మండల అధ్యక్షుడు అశోక్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటయ్య గౌడ్, నాయకులు ఉమాపతిరెడ్డి, నర్సింహ నాయక్, శ్రీను, భాస్కర్, భరత్‌కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్‌ను నమ్మి.. ఆగం కావొద్దు

- ఐదేళ్లలో ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి చేసిందేమీ లేదు
- కాంగ్రెస్‌కు ఆదరణ పెరుగుతోంది
- పార్టీ తాండూరు అసెంబ్లీ అభ్యర్థి మనోహర్‌రెడ్డి

**తాండూరు:** మాయమాటలతో ఓట్లు దండుకునేందుకు బీఆర్ఎస్ నేతలు వస్తారని, వారిని నమ్మి మోసపోవద్దని కాంగ్రెస్ పార్టీ తాండూరు అసెంబ్లీ అభ్యర్థి బుయ్యని మనోహర్‌రెడ్డి సూచించారు. బుధవారం తాండూరులోని పలు వార్డుల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మల్‌రెడ్డిపల్లి నుంచి ప్రారంభమైన ప్రచారం ఇందిరానగర్, గుండుపీర్లు, గాంధీచౌక్ మీదుగా సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ నుంచి గెలుపొంది అభివృద్ధి కోసమే బీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు చెప్పిన ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ఈ ప్రాంతానికి చేసింది ఏమీ లేదని ఆరోపించారు. అతని కుటుంబ సభ్యులే అన్ని రకాలుగా బాగుపడ్డారని అన్నారు. అధికారంలో ఉన్నన్ని రోజులు భూ కబ్జాలతో కాలం గడిపారని ఆరోపించారు. ప్రస్తుత ఎన్నికల్లో ప్రజలు తనకు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను అమలు చేస్తుందన్నారు. కాంగ్రెస్ మాట ఇస్తే తప్పదని తెలిపారు. బీఆర్ఎస్ ఎంతో ఆర్భాటంగా ప్రకటించిన డబుల్ బెడ్ రూం ఇళ్లు ఏ ఒక్కరికీ అందలేదని అన్నారు. కాంగ్రెస్ హయాంలో లక్షలాది మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసినట్లు గుర్తు చేశారు. ఎన్నికల వేళ బీఆర్ఎస్ కొత్తగా పథకాల పేరుతో ప్రజలను మోసం చేసేందుకు వస్తోందన్నారు. ఆ పార్టీ మాయమాటలు నమ్మి మోసపోరాదని సూచించారు. కాంగ్రెస్ ఇచ్చిన ప్రతి హామీ అమలవుతుందని పేర్కొన్నారు. ప్రజలు హస్తం గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ప్రతి ఏటా ఎకరా పంట సాగుకు రూ.15 వేలు, రైతు కూలీలకు రూ. 12 వేల చొప్పున సాయం చేయనున్నట్లు తెలిపారు. భవన నిర్మాణ కార్మికులకు అండగా ఉంటామన్నారు. ప్రతి నెలా మహిళలకు రూ.2500 ఇవ్వనున్నట్లు తెలిపారు. అధికార పార్టీ నాయకులు తనను నాన్ లోకల్ అంటున్నారని, ఇది అవాస్తవమన్నారు. తాను 25 ఏళ్ల క్రితమే తాండూరులో ఇల్లు కట్టుకున్నట్లు తెలిపారు. తన కొడుకులు కూడా తాండూరులోనే చదువుకున్నారని గుర్తు చేశారు. ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి నిన్నమొన్న ఇల్లు కట్టుకొని లోకల్ అంటూ ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటన్నారు. ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆదరించి గెలిపించాన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సునితాసంపత్, బషీరాబాద్ మాజీ జెడ్పీటీసీ రాకేష్ మహరాజ్, నాయకులు డాక్టర్ సంపత్‌కుమార్, అబ్దుల్ రవూఫ్, పార్టీ అధికార ప్రతినిధి కల్వ సుజాత, నాయకుడు ప్రభాకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



తాండూరులో ప్రచారం చేస్తున్న మనోహర్‌రెడ్డి

## తాండూరు స్థానాన్ని బీజేపీకే కేటాయించాలి

- పార్టీ జిల్లా అధ్యక్షుడు సదానందరెడ్డి

**తాండూరు టౌన్:** తాండూరు అసెంబ్లీ స్థానాన్ని బీజేపీ అభ్యర్థికే కేటాయించాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సదానందరెడ్డి కోరారు. బీజేపీ – జనసేన పొత్తులో భాగంగా తాండూరు స్థానాన్ని జనసేన అభ్యర్థి శంకర్‌గౌడ్‌కు కేటాయించిన విషయం తెలిసిందే. దీంతో బీజేపీ స్థానిక నాయకులు నిరాశకు గురయ్యారు. పలు దఫాలు పార్టీ అధిష్టానంతో చర్చలు జరిపారు. అయితే జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్ బుధవారం బీజేపీ తరఫున నామినేషన్ వేసేందుకు ఆర్వో కార్యాలయానికి చేరుకున్నారు. అయితే సమయం ముగియడంతో వెనుదిరిగారు. గురువారం నామినేషన్ వేస్తానని చెప్పారు. ఈ సందర్భంగా సదానందరెడ్డి మాట్లాడుతూ.. తాండూరులో పార్టీకి బలం ఉందని, రమేష్‌కుమార్‌కు ఈ సారి అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేయనున్నట్లు తెలిపారు.



నామినేషన్ కేంద్రం వద్ద సదానందరెడ్డి, రమేష్ కుమార్ తదితరులు

## కర్ణాటక సరిహద్దులో నిఘా పెంచండి

- కలబురిగి జిల్లా కలెక్టర్, ఎస్పీని కోరిన వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి
- డబ్బు, మద్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని సూచన



కలబురిగి కలెక్టర్, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ కోటిరెడ్డి

**వికారాబాద్ అర్బన్:** తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా కర్ణాటక నుంచి రాష్ట్ర సరిహద్దు జిల్లాలకు డబ్బు, మద్యం అక్రమ రవాణా కాకుండా సహకరించాలని కలెక్టర్ సీ నారాయణరెడ్డి కర్ణాటక రాష్ట్రం కలబురిగి కలెక్టర్, ఎస్పీని కోరారు. బుధవారం కలెక్టరేట్ నుంచి ఎస్పీ కోటిరెడ్డితో కలిసి కలబురిగి జిల్లా కలెక్టర్, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ.. కర్ణాటక సరిహద్దులోని వికారాబాద్, సంగారెడ్డి, నారాయణపేట జిల్లాల్లో అసెంబ్లీ ఎన్నికలు సజావుగా జరిగేందుకు కర్ణాటకలోని ఏడు సరిహద్దు చెక్ పోస్టుల వద్ద పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయాలని కోరారు. తద్వారా మద్యం, డబ్బు అక్రమ రవాణాను అడ్డుకోవచ్చని తెలిపారు. అనంతరం ఎస్పీ కోటిరెడ్డి మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన కర్ణాటక శాసనసభ ఎన్నికల సందర్భంగా తెలంగాణ రాష్ట్ర సరిహద్దుల్లోని ఏడు చెక్‌పోస్టుల వద్ద పటిష్టమైన నిఘా ఏర్పాటు చేసి ఆ రాష్ట్రానికి సహకరించడం జరిగిందని గుర్తు చేశారు. ప్రస్తుతం తెలంగాణలో ఎన్నికలు జరగనున్నందున ఆ రాష్ట్ర అధికారులు సహకరించాలని కోరారు. అనంతరం కలబురిగే కలెక్టర్ మాట్లాడుతూ.. తమ ప్రాంతం నుంచి మద్యం, డబ్బు, గంజాయి అక్రమ రవాణా కాకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సరిహద్దు చెక్ పోస్టుల వద్ద 24 గంటల గట్టి నిఘా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సంగారెడ్డి, నారాయణపేట జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు పాల్గొన్నారు.

**20లోగా ఓటర్ ఐడీ కార్డులు పంపిణీ చేయాలి**

ఎన్నికలకు సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో జిల్లాలో దరఖాస్తు చేసుకున్న కొత్త ఓటర్లకు ఈ నెల 20లోగా ఓటరు ఐడీ కార్డులు పంపిణీ చేయాలని కలెక్టర్ సీ నారాయణరెడ్డి సూచించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి ఆయా శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటరు నమోదు కోసం జిల్లా వ్యాప్తంగా 1.20 లక్షల మంది దరఖాస్తు చేశారని, వారందరికీ కార్డులు అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ కృష్ణన్, ఎన్నికల అధికారి శంకరాచారి పాల్గొన్నారు.

**కౌంటింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించండి**

**పరిగి:** జిల్లాలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం పట్టణంలోని మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన ఓట్ల లెక్కింపు కేంద్రాలను పరిశీలించారు. స్ట్రాంగ్ రూంలో వసతుల కల్పనపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు ఉండేలా అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది, పోలింగ్ ఏజెంట్ల వాహనాల పార్కింగ్‌కు స్థలం కేటాయించాలన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద మీడియా సెంటర్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎస్పీ కోటిరెడ్డి, ఆర్‌ఓ విజయకుమారి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసన్, ఆర్ అండ్‌బీ డిప్యూటీ ఈఈ సురేందర్ పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### నిరుద్యోగి నామినేషన్




**ఆర్వో వెంకట మాధవరావుకు నామినేషన్ పత్రాలను సమర్పిస్తున్న వినయ్‌కుమార్**

షాద్‌నగర్ అసెంబ్లీ బరిలో నిలిచేందుకు బుధవారం ఓ నిరుద్యోగి నామినేషన్ దాఖలు చేశారు. శంషాబాద్ మండలం పాల్మాకుల గ్రామానికి చెందిన సార వినయ్‌కుమార్ 2018లో జేఎన్టీయూ ఎంటెక్ పూర్తిచేశారు. ఆయన ఎన్నికల అఫిడవిట్‌లో విద్యార్థుల రాజకీయ పార్టీ నుంచి పోటీ చేస్తున్నట్లు. తాను నిరుద్యోగి, భార్య గృహిని తమకు ఎలాంటి ఆదాయ వనరులు లేవని పేర్కొన్నారు.

### ఐదో రోజు @ 59

**సాక్షి, రంగారెడ్డిజిల్లా:** అసెంబ్లీ ఎన్నికల నామినేషన్లు జోరుగా కొనసాగుతున్నాయి. ఈ నెల 3న ప్రారంభమైన ఈ ప్రక్రియ బుధవారం ఐదో రోజుకు చేరింది. జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల నుంచి 45 మంది అభ్యర్థులు 59 నామినేషన్ సెట్లు వేశారు. మహేశ్వరం నుంచి ఐదుగురు అభ్యర్థులు ఆరు నామినేషన్ సెట్లను దాఖలు చేశారు. కల్వకుర్తి నుంచి ఆరు నామినేషన్లు, షాద్‌నగర్ నుంచి ఎనిమిది నామినేషన్లు, ఇబ్రహీంపట్నం నుంచి ఐదు నామినేషన్లు , ఎల్బీనగర్ నుంచి ఎనిమిది నామినేషన్లు, శేరిలింగంపల్లిలో 13 నామినేషన్లు అందజేశారు. ఇక చేవెళ్ల నుంచి కాంగ్రెస్ రెబల్ అభ్యర్థి సున్నపు వసంతం నామినేషన్ దాఖలు చేశారు. రాజేంద్రనగర్ నుంచి 12 నామినేషన్లు వచ్చాయి. గురువారం మంచి ముహూర్తం ఉండటంతో భారీగా నామినేషన్లు దాఖలయ్యే అవకాశం ఉంది.

### రాచరిక పాలనకు స్వస్తి చెప్పండి

కేంద్ర జలవనరుల శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్

**షాద్‌నగర్:** తెలంగాణలో కొనసాగుతున్న రాచరిక పాలనకు స్వస్తి చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందని.. బీజేపీ అధికారంలోకి వస్తేనే అన్ని వర్గాలకు సమన్యాయం జరుగుతుందని కేంద్ర జలవనరుల శాఖా మంత్రి సర్బానంద సోనోవాల్ అన్నారు. బుధవారం షాద్‌నగర్ బీజేపీ అభ్యర్థి అందెబాబయ్య నామినేషన్ ర్యాలీ అనంతరం పట్టణంలోని ఏబీ కాంప్లెక్స్ వెనక మైదానంలో నిర్వహించిన బహిరంగ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా ముందుకు సాగుతోందని అన్నారు. అన్ని వర్గాల ఆర్థిక పురోభివృద్ధి కోసం ప్రధాని మోదీ అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు చేపడుతున్నారని అన్నారు. తెలంగాణలో బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని ఇంటికి పంపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. రాష్ట్రంలో రాచరిక పాలన కొనసాగుతోందని విమర్శించారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చిన సీఎం కేసీఆర్ తన కుటుంబ సభ్యులకు ఉపాధి కల్పించి యువతను మోసం చేశారని ధ్వజమెత్తారు. ప్రజల్లో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా విశ్వసనీయత కోల్పోయిందన్నారు. ఈసారి డబుల్ ఇంజన్ సర్కార్ ఖాయమని ఆయన జోస్యం చెప్పారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్కా నర్సింహారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ తేజం 'మర్రి'

## ఐదు దశాబ్దాల రాజకీయంలో తనదైన ముద్ర

తెలుగు ముఖ్యమంత్రుల్లో మర్రి చెన్నారెడ్డి ప్రత్యేకత చాటాడు. 1978లో దేశమంతా కాంగ్రెస్ వ్యతిరేకత, 1989లో ఎన్టీఆర్ ప్రభంజనంలో కాంగ్రెస్‌ను అధికారం లోకి తీసుకువచ్చిన ఘనత ఆయన సొంతం. ట్రబుల్ మేకర్ అండ్ షూటర్‌గా పేరున్నట్లే పదవులు వివాదాలు వెన్నంటే ఉండేవి.




సిరిపురంలో చెన్నారెడ్డి స్వగృహం



మర్పల్లి మండల కేంద్రంలోని నివాసం

- ఉమ్మడి రాష్ట్రానికి రెండు సార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చెన్నారెడ్డి
- నాలుగు రాష్ట్రాలకు గవర్నర్‌గా సేవలు
- 1969లో టీపీఎస్ ఏర్పాటు
- అనంతరం కాంగ్రెస్‌లో విలీనం

**వికారాబాద్:** మర్పల్లి మండల పరిధిలోని సిరిపురం గ్రామానికి చెందిన మర్రి చెన్నారెడ్డి ఐదు దశాబ్దాల రాజకీయ దురంధురుడు. 1919 జనవరి 13న మర్రి లక్ష్మారెడ్డి, శంకరమ్మలకు జన్మించిన ఆయన అంచలంచెలుగా కీర్తి గడించారు. ప్రజల నాడీ తెలిసిన ఆయన రాజకీయాల్లోనూ తనదైన ముద్ర వేసుకున్నారు. ఆయన ట్రబుల్ మేకర్ మ్రాతమే కాకుండా ట్రబుల్ షూటర్ గానూ పేరు గడించారు. 1969లో తెలంగాణ ప్రజా సమితి పార్టీని స్థాపించి తొలి దశ తెలంగాణ ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లారు. ఉమ్మడి రాష్ట్రానికి రెండు సార్లు ముఖ్యమంత్రిగా, దేశంలోని నాలుగు రాష్ట్రాలకు గవర్నర్‌గా పనిచేశారు.

**విద్యాభ్యాసం**

స్వగ్రామంలో ప్రాథమిక విద్యను పూర్తి చేసి విద్యావసతులు సరిగా లేక రంగారెడ్డి జిల్లాలోని మొయినాబాద్ మండల పరిధిలోని పెద్దమంగళారంలోని మేనమామ కొండా వెంకట రంగారెడ్డి వద్ద ఉన్నత విద్యభ్యాసం పూర్తి చేసుకున్నారు. వికారాబాద్‌లో ఇంటర్ విద్య తర్వాత ఉస్మానియా మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేశారు. ఉస్మానియా ఆస్పత్రిలో ప్రభుత్వ డాక్టర్‌గా వైద్య సేవలందించారు. ఉద్యోగ రీత్యా నాగార్జున సాగర్‌కు బదిలీ అయింది. దీంతో ఆయన తన ఉద్యోగానికి రాజీనామా చేసి పాతబస్తీలోని ఫీల్‌ఖానాలో క్లినిక్ ఏర్పాటు చేసి ఏడాదిన్నర పాటు సేవలందించారు. అక్కడ నుంచి రాజకీయాల్లో అడుగుపెట్టిన ఆయన మేనమామపై ఉన్న కృతజ్ఞతతో 1979లో హైదరాబాద్ పరిసర ప్రాంతాలను కలుపుతూ మాజీ ఉప ముఖ్యమంత్రి కొండా వెంకట రంగారెడ్డి పేరిట రంగారెడ్డి జిల్లా ఏర్పాటు చేశారు.

**తెలంగాణ ప్రజాసమితి ఏర్పాటు**

తెలంగాణ రాష్ట్ర వెనుకబాటును గుర్తించిన డాక్టర్ మర్రి చెన్నారెడ్డి ప్రత్యేక రాష్ట్ర సాధనే ధ్యేయంగా 1969లో 'తెలంగాణ ప్రజాసమితి (టీపీఎస్)'ని స్థాపించారు. అప్పటి పార్లమెంటు ఎలక్షన్‌లో పార గుర్తుపై పోటీచేసి 13 పార్లమెంటు సీట్లకు గాను 11 సీట్లను కైవసం చేసుకుని తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆకాంక్షను బలంగా చూపింది. కాగా అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ చొరవతో మళ్లీ ఆయన కాంగ్రెస్‌లో టీపీఎస్‌ను విలీనం చేశారు. తమిళనాడు రాష్ట్ర గవర్నర్‌గా ఉన్న సమయంలో సీఎం జయలలిత పంపిన ఓ బిల్లును ఆమోదించాల్సి ఉండగా బిల్లు రాజ్యాంగ విరుద్ధమంటూ తిప్పిపంపారు. జయలలిత గవర్నర్ చెన్నారెడ్డిని రీకాల్ చేయాలని డిమాండ్ చేసినా ఆయన మెట్టు దిగలేదు. గవర్నర్ గిరీకి నేను రబ్బరు స్టాంపును కాదలచుకోలేదంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు అప్పట్లో దేశ వ్యాప్తంగా సంచలనం రేపాయి.

**వికారాబాద్ ప్రాంత అభివృద్ధికి..**

ఈ ప్రాంతంలోని చిన్నపల్లెటూరు నుంచి సీఎం, గవర్నర్ లాంటి అత్యున్నత పదవులను అలంకరించిన చెన్నారెడ్డి వికారాబాద్ ప్రాంతానికి ఎనలేని సేవలను అందించారు. జిల్లాలోని అతిపెద్ద సాగునీటి ప్రాజెక్టు 'కోట్‌పల్లి'నిర్మాణం ఆయన చలువే. దీంతో తాండూరు నియోజకవర్గంలోని పెద్దేముల్, వికారాబాద్ నియోజకవర్గంలోని ధారూరు మండలాల రైతులకు ఈ ప్రాజెక్టు కల్పతరువుగా మారింది. అదే విధంగా పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా ఉన్నప్పుడు వికారాబాద్ పట్టణానికి తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా పట్టణానికి మూడున్నర కిలోమీటర్ల దూరంలోని శివారెడ్డిపేట వద్ద శివసాగర్ పేరుతో చెరువును తవ్వించారు. 1967లో ఈ చెరువు నిర్మాణం పూర్తిచేసుకుంది. ఈ చెరువే నేటికీ స్థానికుల దాహం తీరుస్తోంది. పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా ఉన్న సమయంలోనే చాలా గ్రామాలకు ఉన్న మట్టి రోడ్లను కంకర, బీటీ రోడ్లుగా మార్చి రవాణా సౌకర్యాన్ని మెరుగుపర్చారని పెద్దలు గుర్తు చేస్తుంటారు. ప్రస్తుతం వికారాబాద్ పట్టణం ఎడ్యుకేషన్ హబ్‌గా పిలుస్తుంటారు. దీనికి కారణం విద్యకు తగిన ప్రోత్సాహన్ని ఇవ్వడంలో డాక్టర్.చెన్నారెడ్డి ఆనాడు వేసిన బీజమే. వికారాబాద్‌లో ఉన్నత విద్యావకాశాలను అప్పటి ప్రభుత్వాలు కల్పించకపోవడంతో 1965లోనే వికాస్ మండలిని స్థాపించి కళాశాలల ఏర్పాటునకు కృషిచేశారు. ఈ మండలికి మొదటి చైర్మన్‌గా ఆయనే వ్యవహరించారు. ఈ ప్రాంతంలో అత్యంత ప్రసిద్ధి చెందిన శ్రీ అనంత పద్మనాభస్వామి ఆలయం ఉండడంతో 1968లో శ్రీ అనంత పద్మనాభ (ఎస్ఏపీ) పీయూసీ కళాశాలను అప్పటి ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డిచే ప్రారంభింపచేశారు.

### రాజకీయ ప్రస్థానం

1952, 1957 ఎన్నికల్లో మర్రి చెన్నారెడ్డి వికారాబాద్ నుంచి వరుసగా రెండుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా ఈ నియోజకవర్గం 1962లో ఎస్సీలకు రిజర్వు కావడంతో పక్క నియోజకవర్గమైన తాండూరు నుంచి పోటీచేశారు. 1962, 1967లలో తాండూరు నుంచి అసెంబ్లీకి వెళ్లారు. అనంతరం 1978లో మేడ్చల్ నుంచి పోటీచేసి గెలుపొంది ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టారు. అనంతరం 1989లో సనత్‌నగర్ నుంచి పోటీచేసి గెలుపొందారు. 1978–79, 1989–90లలో రెండు పర్యాయాలు ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా చెన్నారెడ్డి పదవీ బాధ్యతలు చేపట్టారు. అనంతరం రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, తమిళనాడు, పంజాబ్, హర్యానా రాష్ట్రాలకు గవర్నర్‌గా పనిచేశారు. ఈయన ఉత్తరప్రదేశ్ గవర్నర్‌గా పనిచేసేటప్పుడు అక్కడ శాంతిభద్రతల సమస్యలు తలెత్తగా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రపతి పాలన విధించింది. దీంతో ఆయన రాష్ట్ర పరిపాలనా బాధ్యతలను నిర్వర్తించారు. 27 ఏళ్ల పిన్నవయసులోనే బూర్గుల రామకృష్ణారావు మంత్రివర్గంలో ఫుడ్ అండ్ అగ్రికల్చర్ మినిస్టర్‌గా పనిచేసి రికార్డు సృష్టించారు. తమిళనాడు గవర్నర్‌గా ఉండగానే ఆయన కన్నుమూశారు.



## ఎన్నికల సంస్కరణ

- ఈవీఎంలపై అభ్యర్థుల ఫొటోలు
- 2018 ఎలక్షన్ నుంచి అమలు

**మీకు తెలుసా?**

**వికారాబాద్ అర్బన్:** ఎన్నికల సంఘం ఎప్పుడైనా ఓటరుకు ఏది సులభమో దానికే ప్రాధాన్యతనిస్తుంది. ఇందులో భాగంగానే 2018 అసెంబ్లీ ఎన్నికల్లో నూతన సాంకేతిక విధానం అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ విధానమే నవంబర్ 30న జరిగే ఎన్నికల్లో అమలు చేసేందుకు ఎలక్షన్ కమిషన్ సిద్ధమైంది. ఇందుకు సంఘం తగు జాగ్రత్తలు తీసుకుంటుంది. 2018 ఎన్నికల ముందు ఈవీఎంలపై అభ్యర్థి పేరు, కేటాయించిన గుర్తు మాత్రమే ఉండేది. 2018 శాసన సభ ఎన్నికల నుంచి పోటీలో ఉండే అభ్యర్థి ఫొటోను పార్టీ గుర్తు పక్కన ప్రదర్శింస్తుంది. ఈవీఎంలలో అభ్యర్థుల పేరు, పార్టీ గుర్తుతోపాటు 2.5 సెంటీ మీటర్ల పొడవుతో అభ్యర్థి ఫొటో ఉంటుంది. ఓటరుకు పార్టీ సింబల్ గుర్తు పట్టక పోయినా అభ్యర్థిని చూసి ఓటు వేసే వెసులుబాటు కలుగనుంది. నోటా వద్ద మాత్రం క్రాస్ గుర్తు ఉంటుంది. ఓటర్లు అభ్యర్థుల విషయంలో గందరగోళానికి గురికాకుండా ఉండేందుకు ఈసీ ఈ నిర్ణయం తీసుకుంది. ఇందుకు పోటీ చేసే అభ్యర్థులు మూడు నెలల క్రితం తీయించుకున్న స్టాంప్ సైజ్ కలర్ ఫొటోను నామినేషన్ వేసే సమయంలో రిటర్నింగ్ అధికారికి అంజేయాల్సి ఉంటుంది. ఫొటో వెనకాల రంగులు లేకుండా తెల్లగా ఉండేలా జాగ్రతలు తీసుకోవాలి.

# 'రచ్చ'బండ రాజకీయం

- ఏ ఇద్దరు కలిసినా ఎన్నికల చర్చే
- గెలుపోటములపై అంచనాలు



**పరిగి:** 'సర్వేలన్నీ మా వైపే ఉన్నాయి. ఈ సారి విజయం మా పార్టీనే వరిస్తుంది. కాదు కాదు అదంతా తప్పుడు సమాచారం ప్రజల మద్దతు మాకే ఉంది.' అంటూ రాజకీయ పార్టీలు ప్రస్తుతం ప్రచారం చేసుకుంటున్నాయి. నెల రోజులుగా గ్రామాలు, పట్టణాల్లో ఏ ఇద్దరు కలిసినా ఎన్నికలపై చర్చించుకుంటున్నారు. ప్రధాన పార్టీలైన బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ ప్రచారాలు ఊపందుకున్నాయి. బీఆర్‌ఎస్ ముందస్తుగా అభ్యర్థిని ప్రకటించి ఎన్నికల పోరుకు శ్రీకారం చుట్టినప్పటి నుంచి గ్రామాల్లో ఎవరిని కలిసినా.. ఏ పార్టీ గెలుస్తుందనే చర్చే వినిపిస్తోంది. గ్రామ పంచాయతీలు, హోటళ్లు, రచ్చ కట్టలు, కూడళ్లు.. ఇలా అన్నీ రాజకీయ చర్చ వేదికలుగా మారిపోయాయి. ఏ శుభకార్యమైన నలుగురు గుమిగూడితే ఎన్నికలపైనే ముచ్చటించుకుంటున్నారు. ఆ నాయకుడు చాలా బలవంతుడని, ఫలానా వ్యక్తి రాజకీయాలు శాసిస్తాడంటూ చర్చల్లో మునిగిపోతున్నారు. జిల్లాల్లోని పరిగి, తాండూరు, వికారాబాద్, కొడంగల్ అసెంబ్లీ స్థానాలకు చాలా రివ్యూలు క్షేత్రస్థాయిలో జరుగుతున్నాయి. ఎవరికి వారే సర్వే చేశామంటే ఫలానా వ్యక్తి గెలుపు ఖాయమంటూ ధీమా వ్యక్తం చేయడం పరిపాటిగా మారింది. మరో పక్క సోషల్ మీడియాలో సైతం తమ అభిప్రాయాలు పంచుకుంటున్నారు.

**సోషల్ మీడియాలో షేరింగ్‌ల లొల్లి**

అధికారంలోకి మేము వస్తామంటే మేము వస్తామని సోషల్ మీడియా వేదికగా షేరింగ్‌ల లొల్లి జోరందుకుంది. బీజేపీ సైతం అధికార బీఆర్‌ఎస్, ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీలకు దీటుగా ప్రచారాన్ని మొదలు పెట్టింది. గ్రామాల్లోనూ రాజకీయ పార్టీల గ్రూపులు ఏర్పాటు చేసుకుని సందేశం వచ్చిన వెంటనే మిగిలిన వారికి షేరింగ్‌లు చేయడం గ్రూపుల్లో పోస్టులు చేస్తుండటం అధికమైంది.

**ముందస్తు జోస్యంతో నేతల్లో గుబులు**

సోషల్ మీడియాలో వచ్చే షేరింగ్‌లు, రిజల్ట్‌ల కారణంగా నేతల్లో బెంగ పట్టుకుంది. పోలింగ్‌కు ఇంకా 22రోజులు గడువు ఉండగానే ప్రజల నాడీ ఇలా ఉందంటూ జోస్యం చెప్పేవాళ్లు ఎక్కువైంది. ఇంతకు ముందు పోలింగ్ తర్వాత ఓటింగ్ సరళిని బట్టి ఎవరు గెలుస్తారో ఓ అంచనా ఉండేది. ఇంకా పోలింగ్ కాకముందే ఫలానా నాయకుడి పని ఖతమంటూ ముందే చెప్పడం నేతలకు మింగుడు పడడం లేదు.

### ఎవరు గెలుస్తరంటావ్..?

జిల్లాలో రాజకీయం వేడెక్కింది. పరిగి, వికారాబాద్, తాండూరు, కొడంగల్ నియోజకవర్గాల్లో ప్రధాన పార్టీలైన బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ పార్టీల ప్రచారం జోరందుకుంది. గ్రామాల్లో పార్టీల జెండాలు, తోరణాలతో రెపరెపలాడుతున్నాయి. ఎక్కడ నలుగురు కలిసినా ఒక్కటే చర్చ నడుస్తోంది. ఏ అభ్యర్థి గెలుస్తాడు. ఏ పార్టీ అధికారంలోకి వస్తుందో ముందస్తు అంచనా వేసుకుంటున్నారు. మళ్లీ అధికారం బీఆర్‌ఎస్‌కే దక్కుతుందని ఆ పార్టీ నాయకులు ప్రచారం చేస్తుంటే.. ప్రజలు ఆరు గ్యారెంటీలకు ఆకర్షితులై కాంగ్రెస్‌కు పట్టం కడుతారని హస్తం పార్టీ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం పనితీరు, బీసీ నినాదంతో బీజేపీవైపు ప్రజలు మొగ్గు చూపుతారని కాషాయ పార్టీ నాయకులు ప్రచారం చేస్తున్నారు. ఇలా సోషల్ మీడియాతో పాటు రచ్చబండల దగ్గర వాదించుకోవడం కామన్‌గా మారింది.

# కాంగ్రెస్ అభ్యర్థికి సంపూర్ణ మద్దతు




భీంభరత్‌కు మద్దతు ప్రకటిస్తున్న సీపీఐ నాయకులు

- సీపీఐ జిల్లా కార్యదర్శి జంగయ్య

**మొయినాబాద్:** కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి సీపీఐ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య అన్నారు. బుధవారం ఆయన భీంభరత్ నివాసంలో పార్టీ నాయకులతో కలిసి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్, సీపీఐ పొత్తు ఖరారు కావడంతో చేవెళ్లలో భీంభరత్‌ను గెలిపించేందుకు కృషి చేస్తామన్నారు. బీఆర్‌ఎస్, బీజేపీలను ఓడించడమే లక్ష్యంగా సీపీఐ శ్రేణులు పనిచేస్తాయన్నారు. ఈ నెల 10న భీంభరత్ నామినేషన్ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున్న పాల్గొంటాయన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ చేవెళ్ల నియోజకవర్గం కన్వీనర్ రామస్వామి, కో కన్వీనర్, ప్రభులింగం, గోపాల్ రెడ్డి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, చేవెళ్ల, మొయినాబాద్, షాబాద్ మండలాల పార్టీ కార్యదర్శులు సత్తిరెడ్డి, శ్రీనివాస్, జంగయ్య, నాయకులు మక్బుల్, మల్లేశ్, రఘు, నారాయణ, మధు, రుక్కయ్య, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిపక్షాలకు ఉనికే లేదు

- మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మహేందర్‌రెడ్డి

**షాబాద్:** ప్రతిపక్షాలకు తెలంగాణలో ఉనికే లేదని రాష్ట్ర గనులు, భూగర్భ వనరుల శాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆరు గ్యారంటీల పేరుతో తిరుగుతున్నారని.. కర్ణాటకలో అమలు చేయని పథకాలు తెలంగాణలో అమలు చేస్తామని చెబితే ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. ఆ పార్టీలో పదిమంది వరకు ముఖ్యమంత్రి అభ్యర్థులు ఉన్నారని ఎద్దేవా చేశారు. ఓటు అడిగే హక్కు ఒక్క బీఆర్‌ఎస్ పార్టీకే ఉందన్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో తమ పార్టీ అభ్యర్థులు భారీ మెజార్టీతో గెలవబోతున్నట్లు చెప్పారు. ఎవరెన్ని చేసినా కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కాలె యాదయ్యను భారీ మెజార్టీతో గెలిపించేందుకు నియోజకవర్గ కార్యకర్తలంతా సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ గూడూరు నర్సింగ్‌రావు, పార్టీ కార్యదర్శి శ్రీరాంరెడ్డి, సహకార సంఘం చైర్మన్ శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆస్తులు రూ.2.71కోట్లు.. అప్పులు రూ.1.44కోట్లు

- ఎనిమిది కేసులు
- అఫిడవిట్‌లో పేర్కొన్న బీజేపీ ఇబ్రహీంపట్నం అభ్యర్థి దయానంద్‌గౌడ్

**ఇబ్రహీంపట్నం:** 2.71 కోట్ల విలువైన ఆస్తులు, వివిధ పోలీస్ స్టేషన్లలో ఎనిమిది కేసులున్నట్లు బీజేపీ ఇబ్రహీంపట్నం అభ్యర్థి నోముల దయానంద్ గౌడ్ ఎలక్షన్ అఫిడవిట్లో పేర్కొన్నారు.

**ఆస్తులు**

చేతిలో రూ.35వేల నగదు, బ్యాంకు ఖాతాల్లో రూ.లక్ష, రూ.36లక్షలు విలువ చేసే ఫార్చ్యునర్, రూ.30లక్షల విలువైన బెంజ్ కార్లు, 12 తులాల బంగారం, ఇంజాపూర్‌లో రెండు ప్లాట్లు, తుమ్మలూరు పరిధిలో రూ.2కోట్ల విలువ చేసే 6570 చదరపు అడుగుల్లో రెసిడెన్షియల్ విల్లాతో కలిపి రూ.2,71,40,000 ఆస్తులను చూపగా రూ.1,44,22,308 అప్పులున్నట్లు పేర్కొన్నారు.

**సతీమణి జయలక్ష్మి పేరిట**

చేతిలో రూ.21 నగదు, బ్యాంకు ఖాతాలో రూ.5వేలు, 21 తులాల బంగారం, మొత్తం ఆస్తులు రూ.15,06,122

**పెద్ద కుమారుడు కార్తీక్ కుమార్ పేరిట**

పెద్ద కుమారుడు కార్తీక్‌కుమార్ చేతిలో నగదు రూ.8వేలు, బ్యాంకు ఖాతాలో రూ.30వేలు, ఒక బైక్, 5 తులాల బంగారం, మొత్తం ఆస్తులు రూ.4,45,810

**చిన్న కుమారుడు భరత్‌కుమార్ పేరుతో..**

చిన్న కుమారుడు భరత్‌కుమార్ చేతిలో రూ.8 వేలు, బ్యాంకు ఖాతాలో రూ.20 వేలు, రూ.20లక్షలు విలువచేసే 2011 మోడల్ ఆడి, రూ.14 లక్షలు విలువచేసే 2012 మోడల్ ఇన్నోవా కార్లు, 4 తులాల బంగారం, మొత్తం ఆస్తులు రూ. 37,09,928 ఉన్నాయి. వాహనాల లోన్స్‌తోపాటు ఇతర అప్పులు మొత్తం రూ.60,34,964 ఉన్నట్లు చూపారు.

### అమ్మా.. ఆశీర్వదించు



బీఆర్‌ఎస్ కల్వకుర్తి అభ్యర్థి జైపాల్‌యాదవ్ నామినేషన్ వేయడానికి ముందుగా తల్లి ఆశీర్వాదం తీసుకున్నారు. బుధవారం ఆయన నగరం నుంచి చల్లంపల్లికి చేరుకుని ఆయన తల్లి మంగమ్మకు పాదాభివందనం చేశారు. అనంతరం కల్వకుర్తిలో నామినేషన్ దాఖలు చేశారు. – కడ్తాల్





పరిగి: టీఆర్ఆర్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న సర్పంచ్‌లు



పరిగి: తల్లి ఆశీర్వాదం తీసుకుంటున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి



కొడంగల్: చిట్లంపల్లిలో మాట్లాడుతున్న పట్నం మహేందర్‌రెడ్డి



దౌల్తాబాద్: కటింగ్ చేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు మహిపాల్

# ప్రచార ఎ'జెండా'

శాసనసభ ఎన్నికల ప్రచారంలో పార్టీలు జోరు పెంచాయి. అన్ని పార్టీల అభ్యర్థులు ఊరూరా తిరుగుతూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు. కొందరు ద్వితీయ శ్రేణి నేతలు కండువాలు మార్చుతుండగా.. పలువురు తమ అభ్యర్థినే గెలిపించాలని కోరుతూ.. వినూత్నంగా ప్రచారం చేస్తున్నారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే ఎన్నికల ఎజెండాలోని అన్ని హామీలు నెరవేరుస్తామంటూ వివరిస్తున్నారు.